క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని రజకుల ధర్నా



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రజకుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రజక సంఘం ఆధ్వర్యంలో కొండపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద రజకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాస్కరయ్య మాట్లాడుతూ కొండపల్లిలోని దోబీఖానా శుభ్రం చేసి రహదారి ఏర్పాటు చేయాలని, కూటమి ప్రభుత్వం రజకులకు ఇచ్చిన హామీ మేరకు 50 ఏళ్లకే పింఛన్, లాండ్రీ షాపులకు 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇవ్వాలని, జీఓ 27 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సీహెచ్ వెంకట రెడ్డయ్య, శ్రీనివాసరావు, లింగాల పార్వతి, బేబీ సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పుస్తకాల వితరణ



వావిలాల(తిరువూరురూరల్): మండలంలో ఇటీవల అప్ గ్రేడ్ చేసిన వావిలాల జెడ్పీ ఉన్నత పాఠశాల లైబ్రరీకి ఆంగ్ల ఉపాధ్యాయుడు రాంప్రదీప్ పుస్తకాలను శుక్రవారం వితరణ ఇచ్చారు. విద్యార్థులు సులభంగా ఆంగ్ల భాష నేర్చుకునే విధంగా తాను రాసిన పుస్తకాలను ఈ లైబ్రరీకి అందజేశానని రాంప్రదీప్ చెప్పారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కె. విజయ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ-1 మాసగిరి శ్రీనివాస్ పేర్కొన్నారు. గంటిపాడు, పోతనపల్లి, పర్వతాపురం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా తయారు చేయాలని, విద్యార్థుల టాయిలెట్స్ రోజుకు నాలుగు సార్లు పరిశుభ్రంగా కడగాలని, విద్యార్థుల హాజరు నూరు శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

దేశ నాయకుల చిత్రపటాలు వితరణ



జి.కొండూరు: జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామానికి చెందిన వేమన సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతని జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, స్నేహితుల బృందం చెవుటూరు పాఠశాలకు దేశ నాయకుల చిత్రపటాలను శుక్రవారం బహూకరించారు. హెచ్ఎం కేఎస్‌జే లక్ష్మి, ఎ. రమాదేవి, రామిశెట్టి ధను, అజయ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీటి ప్రవాహం



ఆగిరిపల్లి: మురుగునీరు స్థానిక పొన్నం కల్యాణ మండపం రోడ్డుపై నిత్యం పారుతోంది. కొండ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో దిగువన ఉన్న రోడ్డుపైకి మురుగునీరు ప్రవహిస్తోంది. రోడ్డు కింది భాగంలోని తూముల్లో నుంచి మురుగునీరు ఎర్ర చెరువులోకి వెళ్లాల్సి ఉండగా తూముల్లో చెత్తచెదారం అడ్డుపడి మురుగునీరు మొత్తం రోడ్డుపైనే ప్రవహిస్తోంది. తీవ్ర దుర్గంధంతోపాటు దోమలు వ్యాప్తి చెందుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

చాట్రాయి: చనుబండ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్ని కాలనీల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

చినుకు పడితే నరకమే!

- రోడ్లపై వర్షం నీరు నిలిచి బురదమయం
- నీటి కోసం కిలో మీటరు ప్రయాణం
- 700 మందికి ఒక్కటే కుళాయి
- జగనన్న కాలనీలో సమస్యల తిష్ట

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొండపల్లితో పాటు పలు గ్రామాలకు కలిపి కొండపల్లి పరిధిలోని ఈలప్రోలు గ్రామం వద్ద సుమారు 1,515 ప్లాట్లు కేటాయించింది. వారిలో సుమారు 800 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోగా, రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సదుపాయం లేక సుమారు 200 మంది బయటి ప్రాంతాల్లో అద్దెలకు ఉంటున్నారు. సుమారు 700 మంది వరకు అరకొర సౌకర్యాల మధ్య నివసిస్తున్నారు. కొద్దిపాటి వర్షానికి రోడ్లు జలమయం అవుతాయి. బురదగా మారిన రోడ్లపై నడక కూడా కష్టంగా మారుతోంది. తాగునీటి కోసం కిలో మీటరుకు పైగా దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితిని నెలకొంది.



కొండపల్లి జగనన్న కాలనీలో వర్షానికి చిత్తడిగా మారిన రోడ్డు



కుళాయి నుంచి బాటిళ్లలో నీళ్లు పట్టుకుంటున్న కాలనీ వాసులు

రోడ్లు బురదమయం

జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం తప్ప తాగునీటి కుళాయిలు, రహదారి, డ్రెయినేజీ సౌకర్యాలు లేవు. కొద్దిపాటి వర్షానికి కాలనీలో గ్రావెల్ రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. కొన్ని రోడ్లపై అడుగులోతు బురదలో నడవాల్సిన పరిస్థితి ఉంది. పెద్ద వర్షం పడితే కాలనీ మొత్తం జలమయంగా మారుతోంది. పిల్లలను స్కూల్‌కు పంపేందుకు ఆటోలు, బస్సులు ఎక్కించేందుకు చిత్తడిగా మారిన రోడ్లపై కిలోమీటరు దూరం నడకలో వెళ్లాల్సి వస్తోంది. కనీసం ఒక్కటైనా సిమెంటు రోడ్డు నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కాలనీ మొత్తానికి ఒక్కటే కుళాయి

సుమారు 700 మంది నివాసం ఉంటున్న కాలనీకి ఒక్కటే తాగునీటి కుళాయి ఉంది. అది కూడా కాలనీ చివరలో ఆర్అండ్‌బీ రహదారి పక్కన ఆర్‌డబ్ల్యూఎస్ పైపునకు బిగించారు. కాలనీ చివరి వారు నీటి కోసం సుమారు కిలో మీటరుకు పైగా దూరం రావాల్సిందే. బైక్‌లు లేని వారు బిందెలతో మోసుకెళ్లలేక లీటర్, రెండు లీటర్ల వాటర్ బాటిళ్లు పట్టుకుని బక్కెట్లు, ప్లాస్టిక్ సంచుల్లో బాటిల్లు పెట్టుకుని నీరు తీసుకువెళ్లే పరిస్థితి నెలకొంది. ఈ ఇబ్బందులు భరించలేక కొందరు సొంతిళ్లు వదులుకుని అద్దె ఇళ్లకు వెళ్లారు. బోర్లు లేకపోవడంతో వాడుక నీటికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ ముళ్ల పొదలు ఉండటంతో విష సర్పాలు ఇళ్లల్లోకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఒక్క సీసీ రోడ్డు అయినా నిర్మించండి



కొండపల్లి జగనన్న కాలనీలో రోడ్ల సమస్య తీవ్రంగా ఉంది. వర్షం వస్తే రోడ్లపై నీరు నిలిచి చిత్తడిగా మారుతున్నాయి. రోడ్లపై నడవలేని పరిస్థితి. కాలనీలో కనీసం ఒక్క రోడ్డు అయినా సిమెంటు రోడ్డుగా నిర్మిస్తే కాలనీ వాసులకు కొంత వెసులుబాటు కలుగుతుంది.

– ఆర్.లక్ష్మీదేవి, జగనన్న కాలనీ, కొండపల్లి

తాగునీటికి అవస్థలు



కాలనీలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. కనీసం వాడుక నీరు కూడా లేదు. సుమారు కిలో మీటరు దూరంలో ఏర్పాటు చేసిన ఒకే కుళాయి నుంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. కాలనీ వీధుల్లో తాగునీటి కుళాయిలు, వాడుకునేందుకు బోరు పంపులు ఏర్పాటు చేయాలి.

– జానకీదేవి, జగనన్న కాలనీ, కొండపల్లి

పట్టించుకోని పాలకులు, అధికారులు

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, జిల్లా కలెక్టర్ లక్ష్మీశను స్థానికులు కలిసి తమ గోడు విన్నవించారు. స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ దృష్టికి కూడా సమస్యలు తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారే తప్ప ఫలితం లేదు. సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చాట్రాయి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తామని ఎంపీడీఓ భార్గవి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆమె కోరారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం జరుగుతుందని కమిషనర్ మనోజ ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ నిర్మల అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు ప్రధాన సమస్యలపై చర్చిస్తారన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు.

కండక్టర్ వెంకటేశ్వరరావుకు అభినందన

తిరువూరు: బస్సులో ప్రయాణికురాలు పోగొట్టుకున్న నగదు పర్సును తిరిగి అప్పగించిన తిరువూరు ఆర్టీసీ డిపో కండక్టర్ బొల్లెపోగు వెంకటేశ్వరరావును శుక్రవారం డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం అభినందించారు. రెండు రోజుల కిందట తిరువూరు నుంచి విజయవాడ వెళ్లే ఆర్టీసీ బస్సులో కండక్టర్ వెంకటేశ్వరరావు విధులు నిర్వహిస్తుండగా ఒక ప్రయాణికురాలు ఆ బస్సులో ప్రయాణిస్తూ కంచికచర్లలో దిగుతూ బస్సులో తన నగదు, నగలు ఉన్న పర్సు పోగొట్టుకున్నట్లు కండక్టర్‌కు సమాచారం అందింది. వెంకటేశ్వరరావు బస్సులో వెతకగా ప్రయాణికురాలి పర్సు లభ్యమైంది. అందులో రూ.లక్ష విలువైన బంగారు నగలు, కొంత నగదు ఉంది. కండక్టర్ వెంకటేశ్వరరావు ఆ పర్సును ప్రయాణికురాలికి అందజేసి తన నిజాయితీ చాటుకున్నందుకు డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం ఆయనను అభినందించారు.

అద్దె బస్సులు కండీషన్‌లో ఉండాలి

నూజివీడు డిపో మేనేజర్ రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎం రాంబాబు

నూజివీడు: అద్దె బస్సుల నిర్వాహకులు తమ బస్సుల నిర్వహణపై శ్రద్ధ వహించాలని, బస్సులు ఎక్కడా ఆగకుండా నడిచేలా చూసుకోవాలని నూజివీడు డిపో మేనేజర్ జి.రాంబాబు పేర్కొన్నారు. స్థానిక డీఎం కార్యాలయంలో అద్దె బస్సుల నిర్వాహకులకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ ఎప్పటికప్పుడు బస్సులకు మరమ్మతులు చేయిస్తూ కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలన్నారు. మరమ్మతుల పేరుతో ఎట్టి పరిస్థితుల్లో ట్రిప్పులు క్యాన్సిల్ చేయడానికి వీలులేదన్నారు. కొందరు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటివి రాకుండా చూసుకోవాలన్నారు. డ్రైవర్లు కూడా సమయానికి విధులకు రావాలని, ఆలస్యంగా బయలుదేరడానికి వీల్లేదని చెప్పారు. మహిళలకు ఉచిత ప్రయాణం కాబట్టి డ్రైవర్లు ఓపిగ్గా ఉండి ఎక్కడ ఆపినా ఎక్కించుకోవాలని సూచించారు. సమావేశంలో అద్దె బస్సుల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో ఆటో కార్మికుల ధర్నా



ఇబ్రహీంపట్నంలో ధర్నా చేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆటో కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు ఒక సాధికార సంస్థ ఏర్పాటు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అయినా ఆటో కార్మికులను ఆదుకునేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఫ్రీ బస్ వలన ఆటో కార్మికులకు కిరాయిలు తగ్గాయని వాహన మిత్ర పథకం కింద ఏడాదికి రూ.25 వేలు నగదు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. నాయకులు ఆలేటి విఠల్‌రావు, ఎం.మహేష్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కాలనీల్లో రోడ్లపై నిలిచిన వర్షం నీరు



చిన్నంపేట బీసీ కాలనీలో నిలిచిన వర్షం నీరు

చాట్రాయి: అల్ప పీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చిన్నంపేట బీసీ కాలనీ, చనుబండ పాత దళితవాడ, సూరంపాలెం బీసీ కాలనీలో రోడ్లు జలమయమయ్యాయి. రోడ్లపై నిలిచిన నీటిలో నుంచి నడిచేందుకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. నిల్వ ఉన్న నీటితో దోమలు విజృంభిస్తున్నాయి. వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చాట్రాయి నుంచి బూరుగుగూడెం రోడ్డు, స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద మెయిన్ రోడ్డుపై పడిన గుంటల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. అధికారులు స్పందించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

మాజీ సర్పంచ్ కోటేశ్వరమ్మకు నివాళులు



చాట్రాయి: పర్వతాపురం మాజీ సర్పంచ్ మిద్దె కోటేశ్వరమ్మ (70) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కొడుకులు ఒక కుమార్తె ఉన్నారు. మృతురాలి కుటుంబం నుంచి మామ మిద్దె తిరపత వెంకయ్య, తరువాత మృతురాలు కోటేశ్వరమ్మ, భర్త మిద్దె సత్యనారాయణ, మరిది మిద్దె బాలకృష్ణ, కొడుకు మిద్దె శివాజీ (ప్రస్తుత సర్పంచ్) ఈ గ్రామానికి సర్పంచ్‌లుగా పదవులు చేపట్టారు. శుక్రవారం నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దేశిరెడ్డి రాఘవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పరసా చెన్నారావు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు.

1న 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

విస్సన్నపేట: బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఓలేటి దుర్గారావు తెలిపారు. సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నో హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వ మోసాలను వివరించారు. సెప్టెంబర్ ఒకటిన జరుగనున్న సమావేశానికి కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, నాయకులు పాల్గొన్నారు.

యూరియా సరఫరా చేయాలని వినతి

తిరువూరు: ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలకు అవసరమైన యూరియాను వెంటనే సరఫరా చేయాలని సీపీఐ నాయకులు శుక్రవారం తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మకు వినతి పత్రం సమర్పించారు. తిరువూరు మండలంలో డిమాండ్‌కు అనుగుణంగా యూరియా రాక, వచ్చిన ఎరువులు పంపిణీ సక్రమంగా జరగక రైతులు ఆందోళన చెందుతున్నారని, ఆధార్‌కార్డు ప్రాతిపదికగా స్థానిక రైతులకు మాత్రమే ఈ యూరియా సరఫరా చేయాలని కోరారు. వ్యవసాయాధికారిని కలిసిన వారిలో సీపీఐ నాయకులు ఉదయ్, సుబానీ, అశోక్, కృష్ణయ్య, నాగుల్‌మీరా ఉన్నారు.

సేంద్రియ మొక్కల పెంపకంపై సర్టిఫికెట్ కోర్సు

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సేంద్రియ పద్ధతిలో మొక్కల పెంపకంపై సర్టిఫికెట్ కోర్సును శుక్రవారం వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ జె.రాముడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ ఇంటి పెరట్లో పూల మొక్కల నుంచి పండ్ల మొక్కలు, కూరగాయ మొక్కలు సేంద్రియ పద్ధతిలో ఎలా పెంచుకోవాలో ఈ సర్టిఫికేట్ కోర్సు తెలియజేస్తుందని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీపురంశెట్టి రంగారావు, అధ్యాపకులు హరిబాబు, సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృభాషను మరవొద్దు

తిరువూరురూరల్: ఎవరు ఎంత ఎత్తుకు ఎదిగినా మాతృభాష తెలుగును మరవొద్దని పలువురు వక్తలు పేర్కొన్నారు. తిరువూరు, మైలవరం, నూజివీడులో మాతృభాష దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. వ్యావహారిక భాష ఆద్యుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. తిరువూరు మండలం మునుకుళ్ల, ముష్టికుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలు, లక్ష్మీపురం ఎంపీపీ పాఠశాలల్లో తెలుగు వ్యాకరణం, పద్యాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పద్యాలు కంఠస్థంగా అప్పజెప్పే పోటీల్లో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. మాతృభాషా ఆవశ్యకతను ఉపాధ్యాయులు వివరించారు. లక్ష్మీపురం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ఒక్క ఇంగ్లిష్ పదం లేకుండా తెలుగులో మాట్లాడే పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముష్టికుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాలను నిర్వహించారు. విద్యార్థులకు పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తిరువూరు రచయితల సంఘం ఆధ్వర్యంలో మునుకుళ్ల జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు తెలుగు భాషపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు జె. మురళీకృష్ణ పర్యవేక్షించారు. వ్యావహారిక భాషకు వన్నె తెచ్చిన గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



తిరువూరు శ్రీనిధి స్కూల్లో ఉపాధ్యాయులకు సత్కారం



మైలవరం వివేకానంద హైస్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



నూజివీడు మండలం మద్దాయికుంట హైస్కూల్‌లో నివాళి

- తిరువూరు: భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా తిరువూరు శ్రీనిధి టెక్నో స్కూల్‌లో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. హాకీ క్రీడాకారుడిగా ధ్యాన్‌చంద్ సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వ్యావహారిక భాషా ఆద్యుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయులను సత్కరించారు.
- మైలవరం: మైలవరం వివేకానంద పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌లు శ్రీనివాసరావు, పి. రాజారెడ్డిలు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. పాటలు, పద్యాలు, సామెతలు, కవితలు, పొడుపు కథలు, నాటికలు, ఉపన్యాసాలు, శ్రీకృష్ణదేవరాయల అష్ట దిగ్గజ కవుల సభ విధానాన్ని వివరించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు.
- మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి, డీన్స్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.
- చాట్రాయి: తుమ్మగూడెం ఉర్దూ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో తెలుగు భాష గొప్పతనాన్ని హెచ్ఎం వెంకట్రావు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఇన్‌చార్జ్ హెచ్ఎం షేక్ కరిముల్లా, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఎస్ఎంసీ చైర్మన్ షేక్ బాజీబీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నూజివీడు: మండలంలోని మర్రిబంధంలో మద్దాయికుంట జెడ్పీ హైస్కూల్‌లో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి హెచ్ఎం దారపురెడ్డి భాస్కరరావు నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. తెలుగు ఉపాధ్యాయులు శివ నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని అన్నవరం హైస్కూల్‌లో రామ్మూర్తి పంతులు చిత్రపటానికి హెచ్ఎం జి.విజయకుమారి నివాళులర్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

ఇబ్రహీంపట్నం: కిలేశపురం, కొటికలపూడి గ్రామాల్లోని ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. కిలేశపురంలో ఆదిమానవాస లంబాడీ ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికను ఎన్నికల అధికారి యు.నాగశ్రీదేవి, సీఎస్ఆర్ పరశురామ్ నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడిగా బాణావత్ కోటేశ్వరరావు, కార్యదర్శిగా యాదగిరి, ముగ్గురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొటికలపూడి మెట్రోపాలిటన్ ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికను ఎన్నికల అధికారి అజయ్ నిర్వహించారు. అధ్యక్షుడిగా గండ్రాల దేవదాస్, కార్యదర్శిగా దాసు, ముగ్గురు సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.

చెత్తను తొలగించండి



ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. స్థానిక కొలిమి బజార్‌లో రైస్ మిల్ ఎదురుగా, జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద 20 రోజుల నుంచి చెత్త తొలగించలేదు. వర్షాలకు చెత్త కుళ్లి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసు నుంచి ఉపాధ్యాయుడిగా చిన్న నాగరాజు



మైలవరం: మైలవరం ఏసీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పాదిలి చిన్న నాగరాజు మెగా డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటి పాఠశాల ఉపాధ్యాయుడిగా (స్కూల్ సెకండరీ గ్రేడ్ టీచర్)గా ఎంపికయ్యాడు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం పర్వతాపురం గ్రామానికి చెందిన చిన్న నాగరాజు గత ఏడేళ్లుగా సివిల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో తిరువూరు పోలీస్ స్టేషన్‌లోనూ విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందాడు. ఎటువంటి కోచింగ్ లేకుండా తన లక్ష్యమైన ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాడు. చిన్న నాగరాజుకు మైలవరం ఏసీపీ ప్రసాదరావు, తోటి పోలీస్ సిబ్బంది, పర్వతాపురం గ్రామస్తులు అభినందనలు తెలిపారు.